
# న్యాయం

మధురాంతకం నరేంద్ర

“నేనీ అన్యాయాన్ని వొప్పుకోను పెద్దమ్మా! వొప్పుకోనంటే వొప్పుకోను” అంది పంచరత్న మళ్లీ.

“వొప్పుకోకుంటే దిక్కులేని కోర్టులో దావా యేసుకోమనిజెప్పు తిమ్మక్కా” అన్నాడు రాజయ్య నీరసంగా నవ్వుతూ...


యిటీవలే వెల్లవేసుకున్న కొత్తయిల్లు మొదటిసారిగా పౌడరు రాసుకున్న పల్లెటూరి పిల్ల ముఖంలా యెబ్బెట్టుగావుంది. యింటిలోపల పరిచిన చలువరాతి బండలపైన యింకా యిసుకా, సిమెంటూ అతుక్కునే వున్నాయి. పొద్దున జరిగిన గృహప్రవేశపు హోమం తాలూకూ మసిమరకలు హాలులోపలి చలువరాళ్ళపైన యింకా మిగిలేవున్నాయి. గోడలపైన పసుపురంగు చేతిముద్రలు స్పష్టంగా కనబడతున్నాయి. యింటిముందు పగిలిన గుమ్మడికాయముక్కలు చెల్లా చెదురుగా పడివున్నాయి.



చీకటి చిక్కనౌతున్న కొద్దీ శేషాద్రికొండలు నల్లబారిపోతున్నాయి. కొండపైన మెట్లదారివెంట వెలుగుతున్న దీపాలు ఆకాశంనుంచీ దిగివస్తున్న నక్షత్రాల్లా కనబడుతున్నాయి. కొండ శిఖరంపైన వెలుగుతున్న తిరునామాలూ, శంఖుచక్రాలూ ఆకాశంలో వేలాడుతున్నట్టుగా భ్రమను కలిగిస్తున్నాయి.

కొండపాదాల దగ్గరినుంచీ పెరుగుతున్న వూరు దీపాల చెరువులా కనబడుతోంది. వూరిని దూరంగా విసిరేసినట్టున్న కృష్ణానగర్‌లో దూరదూరంగా కడుతున్న యిండ్లలో దీపాలు బెరుకుగా వెలుగుతున్నాయి.

“గృహ ప్రవేశాలప్పుడు యింటిగల్లోళ్ళు యిచ్చిన యినాందుడ్డును కొందరు మేస్త్రీలు కూలీలకు పంచను గూడా పంచరు. ఆకాడికీ పెద్ద మేస్త్రీ మునిరత్నంరెడ్డే మేలు. వాడా జోగల్దానితో కాపరమే పెట్టేసుండాడు. అందుకే దానికి ముగ్గురు కూలీల భాగం పెట్టినాడు. అది వానిష్టం. దీంట్లో నీ మొగుడు చేసిన తప్పేముండాది? అనావస్యంగా నువ్వు అలిగి పొద్దన్నించీ తిండి తినకుండా ఆ మనిషిని సాపిస్తావుండావు. యిదే మాత్రం న్యాయంగాలేదు” అంటూ ముసలి తిమ్మక్క వక్కాకుతో యెర్రబడిన నోరుతెరిచి, దొర్రులుపడ్డ పలువరస వూగుతుండగా దబాయించింది.



యింటిముందు, ముసలివాడి దుబ్బు తలలాగున్న వాచ్‌మేన్ గుడిసెపక్కన, వెదురుకొయ్యపైన వేలాడుతున్న దీపం వొంటరితనంతో తెల్లబోతోంది. హాల్లో గుడ్డిదీపం కింద పుస్తకాల సంచులు పెట్టుకుని కూర్చున్న పిల్లలిద్దరూ నవ్వుకుంటూ గిచ్చులాడుకుంటున్నారు.

“ఆ మేస్త్రీ అన్యాయంగా పంచిన దుడ్డెందుకు తీసుకోవాల్ల? దాన్ని ఆ మనిషి మూతిపైనే యిసిరిగొట్టేసుండాల్ల...” వెలిసిన చీర చిగులుకున్న మొగలిపొదలాగున్న పంచరత్న రవాటించింది.

“బింకానికి పోతే ఆ రెండునూర్లు గూడా రావు. ఆ దుడ్డుంటే పిల్లకాయలు యిస్కూలు ఫీజుకైనా పనికొస్తాది”

సన్నగా, పొడుగ్గా విరిగిన కొడవలిలాగున్న రాజయ్య ముఖం ముడుచుకున్నాడు.

వూరకుక్కొకటి తోకాడించుకుంటూ వచ్చి వాచ్ మేన్ గుడిసెముందు పడుకొంది. చీర రొంపిలోని వక్కాకు తిత్తిలోంచీ గుప్పెడు పొగాకు దుగ్గతీసి నోట్లో పోసుకున్నాక "మన గ్రహచారం బాగునుంటే యీ మాదిరి మేస్త్రీ చేతల్లో పడుండము. వీనిది పోసుగోలుబుద్ధి. సంపాయించిందంతా ఆ జోగల్దాని యెదాన పోస్తావుండాడు. కట్టుకున్న పెండ్లానికి అన్యాయం చేస్తావుండాడు. యిదేమని అడిగే నాధుడెవడుండాడు?" అని ఆక్రోశించింది తిమ్మక్క.

నీళ్ల బక్కెట్టుముందు కూర్చుని ముఖం కడుక్కుంటూ "ఆ బేవార్సు మనిషి అందురూ ఆ మాదిరి యిడిచేసిన ఆడోళ్ళే ననుకుంటావుండాడు. ఆపొద్దు నాతో నరాయించబోయినాడు. చేతిలో వుండే పారతో చెక్కేస్తానన్నా. అప్పటినుంచీ నామింద గుర్రుగావుండాడు. కావాలని నా ముందర దాన్ని నెత్తికెక్కించుకోని కులకతా వుండాడు. తూతూ! నీతీజాతీలేని జన్మం..." అంది పంచరత్నం.

"వాడా పొద్దులేచిన టయిం బాగుండాది. లేకపోయ్యుంటే వానికి కట్టకింద పల్లెలో చెంగల్‌రెడ్డికి జరిగిన శాంతి జరిగుణ్ణు. యీ తావులో నాకు నూకలు మిగిలుండవు" రాజయ్య పంచరత్నకేసి క్రీగంట చూస్తూ నవ్వబోయాడు.

తిమ్మక్క ముళ్ళకంపల వెనక వుమ్మేసి వస్తూ "కట్టకింద పల్లె... చెంగల్‌రెడ్డి.. ఆడేం జరిగిందో చెప్పు చెప్పు అయిలూ!" అని ఆశక్తిగా అడిగింది.

రాజయ్య కవ్విస్తున్నట్టున్న నవ్వు "వాని వొళ్ళంతా కాకెదురు బర్రలతో వాతలు తేలిపోయినాయి" అన్నాడు.

తిమ్మక్క వరండామెట్ల దగ్గరికొచ్చి కూలబడుతూ "యెవురూ కొట్టింది? నీ పెండ్లామేనా?" అని ప్రశ్నించింది.

"యింకెవురు? ఆపొద్దు యీపిల్ల ఆ చెంగల్‌రెడ్డి పెండ్లాంచీర - కొత్తదేలే - కట్టుకోని సాకిరేవునించీ పోతావునిందిలే! వాడొచ్చి చెయ్యిపట్టుకోబోయినాడంట. నాపెండ్లాం చీరగట్టుకోనుంటే నా పెండ్లామే అనుకున్నానని వగలుబోయినాడంట! యీ పిల్ల చేతల్లో వుండే కాకెదురుబర్రలతో వాయించేసింది. వాడు నిలువెత్తు మొగోడు. అయినా యిది ఆ మాదిరిగా తిరగబడితిందని వానికేం తెలుసు? వాడు వూపిరి తిప్పుకునే లోపల వొళ్ళంతా వాతలు తేలిపోయినాయి. వాడు తెపరాయించుకునేలోపల వూర్లోకి పరిగెత్తుకోనొచ్చేసింది" రాజయ్య పరవశంగా చెప్పుకుపోయాడు.

"అయితే అన్నిదెబ్బలు తిన్నాంక ఆ మనిషి గొమ్మునే వున్నాడా అయిలూ?" తిమ్మక్క వుత్కంఠనాపుకోలేక పోయింది.

"వూర్లో వుండే పెద్ద రైతు... యినప్పెట్టెలనిండా దుడ్డుండే మనిషి.. ఆడదాని దగ్గిర దెబ్బలు తిన్నానని చెప్పుకుంటే బొగిసానమని రంపు జెయ్యలేదు. కానీ మేమావూరు యిడిసిపెట్టే దాంకా ముంతపొగ బెట్టినాడు..." అన్నాడు రాజయ్య.

పంచరత్న కొంగుతో ముఖం తుడుచుకుంటూ ధీమాగా "వాని ముగం వాడేం చేస్తాడు? యింకేమీ చెయ్యలేక వాళ్ళ గుడ్డలు గట్టుకుంటా వుండామని పంచాయితీ పెట్టినాడు" అంది.

"ఆమాట నిజమేగదా! వాళ్లు దుడ్డుబెట్టి తెచ్చుకున్న కొత్త గుడ్డల్ని మనం కట్టుకోని కులికేది అన్యాయమేకదా?" రాజయ్య భార్యకేసి సవాలు విసిరాడు.


నరకచతుర్దశి శుభాకాంక్షలు!

పిల్లలు పుట్టని దంపతుల్లారా! విసిగి వేసారిపోయారా?! మీకొక ఆశాకిరణం!



డా॥ రమా సంతాన సాఫల్య కేంద్రం!!



● హైదరాబాద్ ● విశాఖపట్నం ● రాజమండ్రి ● విజయవాడ ● గుంటూరు

ఇక్కడ అన్ని అధునిక శాస్త్రీయ పరీక్షలూ, IVF-ET (టెస్ట్‌ట్యూబ్ బేబి) GIFT, ZIFT, ICSI, డయోడ్ లేజర్‌తో అసిస్టెడ్ హాచింగ్, సెమెన్ డొనేషన్, ఎగ్‌డొనేషన్, సరోగేట్ మదర్ లాంటి సౌకర్యాలు అన్నీ 1991 నుండి మీ సేవలో అందుబాటులో ఉన్నాయి.

పిల్లలు పుట్టక పోవటానికి కారణాలు అనేకం! అవేంటో తెలుసుకొనే పరీక్షలన్నీ ఉన్నాయి ఇక్కడ. తెలుసుకొని శాస్త్రీయమైన ట్రీట్‌మెంట్ మీకు అందించటానికి ప్రపంచస్థాయి వైద్య నిపుణులు ఉన్నారు ఇక్కడ. IVF-ET, ICSI-ET, Diode Laser, Semen Donation, Semen Freezing, Egg Donation, Surrogate Mother లాంటి అన్ని సౌకర్యాలూ కూడా ఉన్నాయి. అందువల్ల ఎటువంటి సమస్యలు ఉన్నవారికైనా తగిన వైద్య సహాయం అందుతుంది. అతితక్కువ స్పెర్మ్ కౌంట్ ఉన్నా, అసలు స్పెర్మ్ కౌంట్ లేకున్నా, వారి టెస్టిస్ లోపల ఏ కొద్దిగా స్పెర్మ్ కణాలు ఉన్నా వాటిని బయటకు తీసి నేరుగా ICSI ద్వారా అండంలోకి పంపి పిండోత్పత్తి జరుపవచ్చు! భర్త విదేశాల్లో ఉద్యోగం చేస్తుంటే, వారు ఇండియా వచ్చినప్పుడు వారినుండి సెమెన్ కలెక్ట్ చేసి, నింపాదిగా నెలనెలా గర్భం కోసం ప్రయత్నించవచ్చు!

స్వంతంగా అండోత్పత్తిలేని స్త్రీలకు డోనార్ ఎగ్ ద్వారా గర్భధారణ కలిగించవచ్చు. గర్భసంచి లేనివారికీ, ఉన్నా గర్భధారణకి వీలుకాని వారికీ సరోగేట్ మదర్ ద్వారా సంతాన ప్రాప్తి కలిగించవచ్చు! ఇదివరకు IVF ఫెయిల్ అయినవారికీ, 35 సం॥ తరువాత IVF ప్రయత్నించేవారికీ, పాలిసిస్టిక్ ఓవరీస్ ఉన్న వారికీ Diode Laser Assisted Hatching పద్ధతిలో గర్భధారణకి కృషి చేయవచ్చు!

మా హాస్పిటల్ 365 రోజులూ తెరిచి ఉంటుంది. వెంటనే వచ్చి కలిసి, మీ సందేహాలు తీర్చుకొని సంతానప్రాప్తికై శాస్త్రీయప్రయత్నం చేయండి!

**సూచనలు:** » ఒక సంవత్సర కాలం కావాలనుకున్నా సంతానం కలుగని దంపతులు వెంటనే సంప్రదించడం ఉత్తమం. » వచ్చే ముందు 5 రోజులు భార్యా భర్తలు దూరంగా ఉండాలి. » ఒకటి, రెండు సార్లు గర్భస్రావం జరిగిన వాళ్లు మళ్లీ గర్భధారణ కోసం ఆగకుండా తప్పనిసరిగా ముందుగానే రావాలి. » వివాహం జరిగాక కూడా ఋతుక్రమం సరిగాలేని వాళ్లు తక్షణం సంప్రదించాలి. లేకపోతే తీరని నష్టం జరగవచ్చు. » తమ పాత రిపోర్టులన్నీ తెచ్చుకోవాలి. » బయటి నుండి వచ్చే వారికి గదులు లభిస్తాయి.

కృషితో నాస్తి దుర్భిక్షం! ప్రయత్నే ఫలీ!

ఈ నెలా, ప్రతి నెలా మా నిపుణుల ప్రాంతీయ కేంద్రాల కార్యక్రమం

డా॥ పాపోలు రమాదేవి గారు

విశాఖపట్నం : 1వ తేదీన మ॥ 3 గం.- రా॥ 8 గం.ల వరకు
2వ తేదీన ఉ॥ 9 గం.- మ॥ 3 గం.ల వరకు
రాజమండ్రి : 3వ తేదీన ఉ॥10 గం.- రా॥ 7 గం.ల వరకు
విజయవాడ : 4వ తేదీన ఉ॥10 గం.- రా॥ 7 గం.ల వరకు
గుంటూరు : 5వ తేదీన ఉ॥ 9 గం.- సా॥ 6 గం.ల వరకు

Dy. Director డా॥ విజయలక్ష్మి గారు

విశాఖపట్నం : 15వ తేదీన మ॥ 3 గం.- రా॥ 8 గం.ల వరకు
16వ తేదీన ఉ॥ 9 గం.- మ॥ 3 గం.ల వరకు
రాజమండ్రి : 17వ తేదీన ఉ॥10 గం.- రా॥ 7 గం.ల వరకు
విజయవాడ : 18వ తేదీన ఉ॥10 గం.- రా॥ 7 గం.ల వరకు
గుంటూరు : 19వ తేదీన ఉ॥ 9 గం.- సా॥ 6 గం.ల వరకు

డా॥ రమా సంతాన సాఫల్య కేంద్రం

ISO 9001:2000 సర్టిఫైడ్ ఐ వి ఎఫ్ సెంటరు

చందన బ్రదర్స్ ఎదురుగా, అమీర్‌పేట్, హైదరాబాద్.
ఫోన్లు : (040) 2340 1255, 2340 2294
ఫోన్‌లో ఉచిత కన్సల్టేషన్ : 9989223341
E-mail: ramafertility@yahoo.com
website: www.fertilityindia.com

విశాఖపట్నం ఫోను : (0891) 2597360; విజయవాడ ఫోన్లు : (0866) 6630582, 2485874, 9989223324;
రాజమండ్రి ఫోన్లు : (0883)2476693, 2443968; గుంటూరు ఫోన్లు : (0863)2261206, 2264110.

''రెక్కలిరుచుకోని ఆ గుడ్డల్ని వుతికే చాకలోళ్ళకు వాటిమింద ఆమాత్రం అతికారం వుండదా పెద్దమ్మా? మనమొకటి రెండు దినాలు కట్టుకుంటే తప్పాచెప్పు?'' పంచరత్నం రెట్టించింది.

''మనం మనమని మనం చేసిందంతా న్యాయమంటే యేం బాగుంటుంది తిమ్మక్కా! వుతికిందానికి రైతులు మాన్యం బెడతానే వుండారు. ప్రతి దినమ్మా రేయిటాల అన్నమేస్తావుండారు. మోజు పడినపుడు వాళ్ళకు తెలవకుండా యెప్పుడో వొక రోజు వాళ్ళ గుడ్డలు కట్టుకుంటే పరవాలేదు. అట్ల కాదని వాళ్ళ గుడ్డలు మాగ్గూడా సొంతమే అంటే రైతులు గొమ్మునుంటారా? తరమగొడతారు.'' రాజయ్య నిట్టూర్చాడు.

''ఛత్... వాళ్ళు తరిమేదేంది? అట్లాంటి మనుషులకు చాకిరి చేసేదే తప్పని మేమే వచ్చేసినాం'' పంచరత్న కోపంతో పళ్ళు కొరుకుతూ భర్తకేసి వురిమిచూసింది.

యింటిముందు స్కూటరొకటివచ్చి ఆగింది. గుడిసెముందు పడుకున్న కుక్క పైకిలేచి తోకాడించసాగింది.

రాజయ్య పైకిలేచి నిల్చుని ''రాండిసార్! యీ వేళప్పుడు వచ్చినారేంది?'' అని అడిగాడు.

పొట్టిగా దిట్టంగా వున్న యువకుడు స్కూటర్‌ను వరండా ముందు ఆపి బీగం వేస్తూండగా, సన్నగా నాజూగ్గావున్న యువతి ''గృహ ప్రవేశమయ్యాక మూడు దినాలు యింటి వోనర్లు యిక్కడ్నే పడుకోవాలంటున్నారు...'' అంది.

స్కూటర్‌పైన్నుంచీ కిందికి గెంతిన అయిదారేళ్ళ అమ్మాయి ''కిరణ్, లావణ్య యెక్కడ?'' అంటూ ముందుకొచ్చింది.


యింటిగల్లావిడ తీసుకొచ్చిన ప్లాస్టిక్ చాపనూ, తలగడనూ అందుకుంటూ ''అయితే యీరేత్రికి యిక్కడ్నే పండుకుంటారామ్మా మీరు?'' అని అడిగింది పంచరత్న విస్తుపోయి చూస్తూ.

పుస్తకాల సంచులముందు నుంచీ పైకి లేచి వరండాలో కొచ్చిన పిల్లలిద్దర్నీ విసుగ్గాచూస్తూ ''మీరంతా తోడుంటారు గదా! పర్వాలేదు...మూడురోజులేగదా? అడ్జెస్ట్ చేసుకుంటాం!'' అంది యింటిగల్లావిడ. తరువాత హాలు లోపలికొచ్చి 'రెండు నెలలవరకూ మంచిముహూర్తాలు లేవని యింటి పని పూర్తిగాకుండానే ఆదరాబాదరగా గృహ ప్రవేశం చెయ్యించేశారు. యింకా రూముల్లో బల్బులుగూడా వెయ్యలేదు. బాత్రూం కొళాయిలకు టాంకునుంచీ కనెక్షనయినా యిచ్చారోలేదో తెలియదు'' అంటూ వాపోయింది. కిటికీలోంచి బయట మోహరించిన చీకటిని భయంభయంగా చూశాక ''సాయంత్రంకాగానే యీకిటికీల తలుపులన్నీ వేసేయ్యాలి.... లేకపోతే యిలా దోమలన్నీ లోపలికొచ్చేస్తాయి. యెక్కడ పడుకోవాలిప్పుడు? హాల్లో మాత్రమే ఫేనుంది'' అంటూ స్వగతంలా చెప్పుకుపోయింది.

ఆమె వెంటే నిల్చున్న పంచరత్న ''ఆ ఫాను మాదేనమ్మా! పిల్లకాయలు సీగటీగలతో అవస్త పడతావుండారు. యీ యింటికాడికి వాచ్‌మేన్‌గా వస్తానే మా యింటాయన మా వూరికి పోయి, వాళ్ళ వాళ్ళ కరెంటంగిడినించీ పాతఫాను దీసుకోనొచ్చి బిగించినాడు. యిదొచ్చినాంకే పిల్లకాయలు కండ్లమీద రెప్పేస్తావుండారు'' అంది.

వరండామెట్లపైన కూర్చున్న పిల్లలు ముగ్గురి గోల పెద్దగా తయారౌతోంది.

''వాచ్‌మేను కోసరం పేరుకు గుడిసేస్తారు గానీ యెప్పుడూ దాంట్లో తావుండదమ్మా! యిప్పుడు గూడా గుడిసెనిండా సిమెంటు మూటలుండాయి. వాళ్ళ కుటుంబరం నలుగురూ, నేనొకతీ మొత్తం అయిదుమందీ యిప్పుడైతే యీ హాల్లో పడుకుంటావుండాం. యింతకు ముందయితే ఆ యిసికలో ఆ కంపలమధ్యనే దొర్లతా వుంటిమి'' అంది తిమ్మక్క.




యింటిగల్లాయినతో మాట్లాడుతా రాజయ్య వరండా పక్కనుంచీ మిద్దెమెట్లు యెక్కుతున్నాడు.

హాల్లోని వొంటరి ప్లాస్టిక్ కుర్చీలో కూచున్నాక ''నువ్వు గూడా యిక్కడ్నే పండుకుంటా వుండావా?'' అని కసిరింది యింటిగల్లావిడ.

తిమ్మక్క పెదవులు చెవులదాకా పాకేలా నవ్వి ''దినమ్మూ మా అగ్రారం పోయేసొచ్చేదానికంటే యిదే బాగుండాదమ్మా నాకు! ఆవూర్లో మాత్రం నాకెవురుండారు? వుండేది వొంటికట్టె. పగుల్లో కూలీ చేసుకుంటూ వుండాను. రాత్రుల్లో యిక్కడ్నే పండుకుంటా వుండాను. పంచరత్న వండిందేదైనా నావరకూ మిగిలితే తింటాను. లేకపోతే రాజయ్య మెస్సునించీ తెచ్చిస్తాడు'' అంది.

యింటిగల్లావిడ పాత దినపత్రికతో విసురుకుంటూ ''యింకా తడిసిన గోడలనుంచీ సిమెంటు వాసనొస్తోంది'' అంటూ నిట్టూర్చింది. ''తడిచీ తడిచీ మార్బులు ఫ్లోరింగు మంచు మాదిరి జిల్లుమనుంది. చుట్టూ యిండ్లూ రాలేదు. యింకా కాంపౌండువాల్ కట్టలేదు. ఆ పక్కరూములో యేకిటికీలకు తలుపులు గూడా తగిలించలేదు. యీ మాదిరి వొకటి సగంగా వుండే యింట్లో మూడురాత్రులు నిద్ర చెయ్యాల్సిందేనంటారు. రాత్రుల్లో దొంగెవడైనా పడి మెడలోవీ, చెవుల్లోవీ వొలుచుకోని బొయినా కాపాడే దిక్కులేదు....''

ముసలి తిమ్మక్క యింటిగల్లావిడ కెదురుగా నేలపైన చెత్తబుట్టలా కూలబడింది. పొగాకు దుగ్గును చప్పరిస్తూ ''ఆ మెడలో వుండే నాను తాడు గూడా యింట్లోనే పెట్టేసి వచ్చుండగూడదాకా!'' అంది. గోడకానుకుంటూ పెదవులు చప్పరించి ''ప్చ్... పరవాలేదులేక్కా! మేమంతా వుండ్లా... నీకేం బయంలేదు. రేత్రుల్లో నేనంత వొళ్లు మర్చిపోయి నిద్రపోయ్యేదాన్ని గాదులే.. చీమ చిటుక్కుమన్నా లేచి కుచ్చుంటాను. యీ రాజయ్య మాదిరి వాచ్‌మేన్ను నేను జూడ లేదు. రేత్రుల్లో యెప్పుడు పిలిచినా పలకతాడు'' అంది.

మిద్దెపైన్నుంచీ కిందికి దిగుతూ ''యెనిమిదిన్నరవతోంది. పడకేస్తే డాలీ పడుకుంటుంది'' అన్నాడు యింటిగల్లాయిన.

''హాల్లో ఫానుకింద చెత్తదిమ్మాలి'' అంటూ యింటిగల్లావిడ పంచరత్నకేసి చూసింది.

''మీరు యిక్కడ... పండుకుంటారా.. క్కా'' పంచరత్న కళ్ళార్పడంసైతం మరచిపోయి యింటిగల్లావిడనే చూడసాగింది. రాజయ్య భార్యకేసి తిరిగి చూశాక, ముఖం వెలవెలబోతూండగా ''యిక్కడ... పండుకోండి సా.. మ్మేయ్... పొరకెత్తుకోని ఆ ఫానుకింద చెత్తదోయ్...'' అన్నాడు. ముసలి తిమ్మక్క ''యీ మూడు దినాలూ మేము ఆ పక్కన వరండాలో పండుకుంటాంలేక్కా...'' అంటూ చేతులు నేలపైన వూన్చుకుని, నడుమును పైకెత్తి గొల్లభామపురుగులా నిలబడింది.

యింటిగల్లావిడ కుర్చీని వరండాలోకి లాక్కుని

కూర్చున్నాక "డాలీ! నువ్విలారా!" అని పిలిచింది. మెట్లపైన కూచున్న డాలీ తిరిగి చూడలేదు.

పెద్దగా ఆవులిస్తూ హాల్లోకొచ్చిన యింటిగల్లాయిన "యీపొద్దు బాంకులో పని హెవీ అయింది. డామ్‌టయర్డ్... నొద్రొస్తావుంది" అన్నాడు. తరువాత యధాలాపంగా "మీరంతా అన్నాలు తిన్నారా రాజయ్యా?" అని అడిగాడు.

"పిల్లకాయలిద్దరూ తిన్నారుసా... మొగుడిపైన అలిగి ఆ పెండ్లామూ, పెండ్లాం తినలేదని యీ మొగుడూ – వీళ్ళిద్దరూ మాత్రం యింకా తినలేదు సా.." అంది తిమ్మక్క పిర్యాదుచేస్తున్న ధోరణిలో. రాజయ్య ఆమెను మాట్లాడవద్దన్నట్టుగా సైగచేశాడు. పంచరత్న విసురుగా హాల్లో చిమ్మసాగింది.

"పెద్ద మేస్త్రీ మీరిచ్చిన యినాం దుడ్డును వలపక్షంగా పంచినాడు సా... యిచ్చినదుడ్డు తక్కువైనా యీ వాచ్‌మేన్ తీసుకున్నాడు. అందుకని ఆ పిల్ల మొగుడిపైన అలిగింది" అంటూ అడగని ప్రశ్నకు తిమ్మక్క సమాధానం చెప్పింది.

"ముందు తినేసి రండి పంచరత్నా! గృహప్రవేశం జరిగిన యిల్లు... మొదటిరోజు యిక్కడెవ్వరైనా పస్తులుండడం మంచిది గాదు" అంది యింటిగల్లావిడ కోపంగా.

తిమ్మక్క మళ్లీ వరండామెట్లపైన సర్దుకుని కూచుంటూ వెళ్లి తినమన్నట్టుగా రాజయ్యకు సైగచేసింది. అతను నీరసంగా నవ్వబోయాడు.

ఫానుకింద చాపను పరిచాక "ఆడింది చాలు... యిక వచ్చి పడుకో డాలీ!" అంది యింటిగల్లావిడ పుల్ల విరిచినట్టుగా.

"రేయ్! మీరు లేచిరాండి.." పంచరత్న తన పిల్లల్ని గద్దించింది.

"అక్కచెప్పింది యినబళ్లేదా నీకు? ముందుగా రెండు కవళాలు తినేసి రాబోండి యిద్దరూ... పిల్లకాయిలు గూడా పండుకుంటారు" అంటూ తిమ్మక్క కసిరింది.

రాజయ్య పిల్లల పుస్తకాల సంచులెత్తుకుని గుడిసె దగ్గరికి నడిచాడు. పంచరత్న చాటలోని దుమ్మును దూరంగా పడేశాక గుడిసెవైపు కదిలింది.

యింటి చుట్టూ పొదల్లోంచీ కీచురాళ్ళు అరుస్తున్నాయి. వూళ్లో యెక్కడినుంచో అంబులెన్సు హారను వినబడుతోంది. ఆకాశంలో పరిగెడుతున్న రెండు విమానాలు నక్షత్రాల్లా కనబడుతున్నాయి. గుడిసెముందు వెదురు కర్రపైన వెలుగుతున్న దీపంచుట్టూ రెక్కల పురుగులు ప్రదక్షిణాలు చేస్తున్నాయి.

"డాలీ, వచ్చిపడుకో" ఇంటి గల్లావిడ అసహనంగా పిలిచింది.

గుడిసెలోంచీ పాత బొంతను తీసుకొచ్చి వరండాలో పరుస్తూ "నువ్వుపొయి పండు కోబోమ్మా! రేయ్, మేయ్... మీరిట్టొచ్చి పండు కోండి" అని పిల్లలు ముగ్గురితోనూ మాట్లాడింది పంచరత్న.

"యీ ఫేనింత పెద్దగా సౌండు చేస్తోంది. దీనికింద నిద్రెలా పోవటం?" అంటూ హాల్లోంచీ యింటిగల్లాయిన వాకబుచేశాడు.

తిమ్మక్క గుడిసెకేసి చూశాక "యీడ వొగటే చీగిటీగలుసా.. అది తిరగతావుంటేనే కునుకు పట్టేది.." అంది.

గుడిసెలోంచీ సవకంతో చేయి తుడుచుకుంటూ బయటికొచ్చిన రాజయ్యతో "తినిందా?" అని అడుగుతున్నట్టుగా సైగచేసింది తిమ్మక్క. అతను తల అడ్డంగా వూపుతూ వచ్చి వరండాలో కూర్చున్నాడు.

"డాలీ, వచ్చి పడుకో" యింటిగల్లాయిన గొంతు టంగుమని మోగింది.

డాలీ ముఖం ముడుచుకుని లేచి వెళ్లిపోయింది. మిగిలిన పిల్లలిద్దరూ బొంతపైకి చేరారు.

రాజయ్య సవకాన్ని నోటికడ్డంగా పెట్టుకుని "దీంతో చచ్చేచావొచ్చి పడింది" అన్నాడు. తిమ్మక్క పక్కకువొంగి "యేందీ... యినబళ్లేదు..." అని అడిగింది.

"నీకు చెవుడు. దానికి తిమురు" అంటూ రాజయ్య వురిమిచూశాడు. జేబులోంచీ బీడీ తీసి నోట్లో పెట్టుకున్నాడు. హాల్లోకి తొంగి చూశాక బీడీని తీసి మళ్లీ జేబులో పెట్టుకున్నాడు.

బొంతపైన పడుకున్న పిల్లలిద్దరూ యెందుకో పెద్దగా నవ్వుతున్నారు.

"రేయ్! గొమ్మునా నోర్మూసుకోని పండుకోండి. కూతినబడిందంటే తోలు వలిచేస్తా" రాజయ్య కోపంగా అరిచాడు.

"మిషనేసి యీ సీసాలోకి నీళ్ల పట్టు రాజయ్యా! తాగటానికి నీళ్ళు కావాలి" అంది యింటిగల్లావిడ.

రాజయ్య మిషన్ మీటనొక్కి బోరింగు దగ్గరున్న కొళాయిలోంచీ సీసాలోకి నీళ్ళు పట్టాడు.

"ముందుగా వాటర్ ఫిల్టర్ తెప్పించండి. యీ బోరింగు నీళ్ళు తాగితే యేం జబ్బులొస్తాయో!" యింటి గల్లావిడ విసుక్కొంది.

"యీ బోరింగునీళ్ళు టెంకాయనీళ్ల మాదిరిగా తియ్యంగా జమ్మునుంటాయక్కా!" అంది తిమ్మక్క.

"నీళ్ళు పట్టాక బోరింగాపేసేయ్ రాజయ్యా! హాల్లో లైటుగూడా తీసేయ్... బయటుండే లైటు చాలు" అన్నాడు యింటిగల్లాయన.

దీపం తీసేయగానే హాలులోపలికి చీకటి దూరేసింది. గుడిసెముందున్న దీపం పహరాగాయడం మొదలుపెట్టింది. వరండాలో పడుతున్న లేత వెలుతురులో బొంతపైన పిల్లలు ముడుక్కున్నారు. ముసలావిడ గుడిసెలోంచీ తన బొంత తీసుకొచ్చి పిల్లలకవతల పరచుకుంది. పంచరత్న మెట్లపైన కూర్చుని ముఖాన్ని అవతలికి తిప్పుకుంది.

హాల్లోంచీ యింటిగల్లాయిన గురక మంద్రంగా వెలువడసాగింది. గుడిసెముందున్న దీపం చుట్టూ రెక్కల పురుగులు గానుగెద్దుల్లా తిరుగుతున్నాయి.

శేషాద్రి కొండలు చీకటిలో కలిసిపోవడంతో మెట్లదారి పక్కనున్న దీపాలు ఆకాశంలోంచీ జారిపడుతున్న నక్షత్రాల్లా కనబడుతున్నాయి. కొండకింద దీపాలు తగిలించుకున్న వూరు తెరుచుకున్న నక్షత్రాల ఆస్పత్రిలావుంది.

తిమ్మక్క పొగాకు దుగ్గును తిత్తిలోంచీ చేతికి తీసుకుంటూ "వాడెవుడో యేందో చేసినాడని నీ మొగుడ్ని సాధిస్తే యెట్లతల్లీ! రెండు కవళాలు తినేసి రాపో... నువ్వు తినలేదని ఆ మనిషి గూడా పస్తుపడుకోనుండాడు. యింటిగల్లామె చెప్పింది యిన్లేదానువ్వు" అంటూ మొదలుపెట్టింది.

రాజయ్య యింటికి దూరంగా వెళ్లి నిలబడి బీడీ వెలిగించుకున్నాడు.



## బట్టలతో కారు....

**ఇ**ది నిజమైన కారు అనుకుంటే పప్పులో కాలేసినట్లే... కారులాగే కనిపించినా, దీనిలో కూర్చోవడానికి కానీ, ప్రయాణించడానికి కానీ ఏమాత్రం వీలు లేదు. చూడడానికి ఇది ఫెరారీ కారులాగా ఉన్న దీనిని, బట్టలతో తయారు చేశారు. చూడగానే ఫెరారీ కారు అనిపించే విధంగా తయారు చేసిన ఘనత లండన్‌లోని కార్నబై స్ట్రీట్‌లోని హ్యూమా స్టోర్ వారిది. దీని తయారీకి మొత్తం 1,999 రకాల బట్టలను ఉపయోగించారు. 1,682 టీ షర్టులు, 88 జతల జీన్స్, 64 జతల చెప్పులు, 31 బెల్టులు వాడారు. సుమారు ఒక వారం పాటు కష్టపడి ఈ కారుని డిజైన్ చేసినట్టు స్టోర్ నిర్వాహకులు తెలిపారు. మొత్తం ఎనిమిది మంది సభ్యుల గల బృందం ఐదుగంటల పాటు శ్రమించి దీన్ని రూపొందించారు. కారు టైర్లకి నల్లని జీన్స్ ప్యాంట్లు, కారు రంగుకి ఎరుపు రంగు టీషర్టులు వాడారు. కారు అద్దాలకి, మిర్రర్‌కి వాటర్ బాటిల్స్‌ను ఉపయోగించారు. ఈ కారుకి అపూర్వ స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి మోడల్ కార్లు రూపొందించడానికి తమకు పలు కంపెనీల నుంచి అభ్యర్థనలు అందుతున్నాయని వారు చెప్పారు.

''మా ఫానుకింద వాళ్లెట్ల పండుకోని నిద్రపోతారు? నా బిడ్డల్నిట్ల అసోద్యంలో దొంగల్లోలేదేం న్యాయం?'' పంచరత్న గొంతు మళ్లీ చీకటిని రంపంలా పర్రున కోసింది.

వులిక్కిపడి, పొగాకును నమలడం సైతం మరచిపోయి, ''యేందీ? యేంది?'' అంది తిమ్మక్క.

''ఆఫాను మాది. మా యింటాయిన మావూరి దాంకా పోయి, అంగిట్లో నించీతెచ్చి, సొయంగా బిగించిందది. దానికింద పండుకునే అతికారం నా బిడ్డలకు గాకుండా యింకెవురుకైనా యెట్లుంటాది? యింతజరిగినా ఆ మొగోడు గొమ్మునే వుండాడు. యీ మాదిరిగా నేనెన్ని అన్యాయాలు వోర్చుకోవాల్ల? యెన్ని అగసాట్లు పడాల్ల?'' పంచరత్న అదే తీవ్రతతో చెప్పుకుపోయింది.

''అట్లంటే యెట్ల పంచరత్నా! యిల్లే వాళ్లది. మనం కూలీపన్లు చేసుకునేదానికొచ్చినోళ్లం... వాళ్ళతో పందెమేస్తే మనకు జరిగితిందా చెప్పు?'' తిమ్మక్క నివ్వెరపోయి చూస్తూనే మందలించింది.

బీడీ పారేసి వచ్చిన రాజయ్య ''కొంచెం మెల్లింగా మాట్లాడు... వాళ్లు యింటే బాగుండదు'' అని భార్యను కసిరాడు.

పంచరత్న నీళ్ళు నిండిన కళ్లతో చీకట్లోకి చూస్తూ నిట్టూర్చింది. కాస్సేపాగాక ''ఆ ముండా పాము యీ పక్కన్నే తిరగాడతావుండాది. పొద్దనగూడా గనబడింది. బిడ్డల్నేసుకోని యీ అద్దానంలో పండుకుంటే నాకు నిద్రెట్ల పడితింది?'' అని వాపోయింది.

రాజయ్య ఆమెకు బారెడు దూరంలో కూచుని ''యీపొద్దు గనబడిందా? యెక్కడ?'' అని ఆందోళనతో అడిగాడు.

పంచరత్న తల తిప్పలేదు.

''పొద్దన జూసినావా? యెక్కడమ్మీ?'' అంటూ తిమ్మక్క పక్కఉ జరిగి బయంబయంగా అడిగింది.

''ఆ పక్కన.... నీళ్ళ తొట్టి దగ్గర. జరజరా ఆ మూలుండే పుట్టలోపలికి పొయ్యింది...'' అంది పంచరత్న. తరువాత పక్కకు తిరిగి పిల్లల పైన దుప్పటికప్పుతూ ''పాడూ చీగిటీగలు.. వీటికి ధూముగూడా తగల్లేదు. బిడ్డలుతిన్న తిండంతా యియ్యే తాగేస్తావుండాయి'' అంది గద్గదమైన గొంతుతో.

''అది చెదులుండే పుట్ట... పాము దాంట్లోలేదు'' అన్నాడు రాజయ్య.

''నేను చూస్తావుండగానే ఆపాము ఆ పుట్టలోకి దూరింది'' పంచరత్న పురిమిచూసింది.

''దాన్ని జూస్తే మనకెంతబయమో, మనల్ని జూస్తే అంతే దానికీ బయం... మనషులపొవిడి యినబడగానే అదాపుట్టలోకి దూరేసుంటాది..'' అంటూ తలవూపాడు రాజయ్య.

తరువాత ముసలావిడకేసి తిరిగి ''యీ తావులో యిప్పుడైతే యిండ్లు లేస్తావుండాయి. ముందు యిదంతా పైర్లు జేస్తావున్న నేల. పాములూ కప్పలూ తిరగాడతావున్న తావు. అవిటి తావులోకొచ్చుండేది మనమూ... అవిటి తావులో అవి తిరగతావుంటే రాద్దాంతం జేసేదేన్యాయం చెప్పు తిమ్మక్కా!'' అని సరాయించాడు.

''అట్లనిజెప్పి అవిట్నే తెచ్చి నట్టింట్లో పెట్టుకోమను పెద్దమ్మా! నేనూ నా బిడ్డలూ నెత్తిమీద గుడ్డేసుకోని పోతాము'' పంచరత్న క్రీంకారం చేసింది.

తిమ్మక్క రాజయ్యను మాట్లాడద్దన్నట్టుగా సైగచేసాక ''రెండు పిడచలు తినేసి రాబోమ్మా ! కడుపులో ఏమీ లేకుంటే నిద్రరాదు'' అంది.

చాలాసేపు మౌనంగా వుండిపోయిన పంచరత్న నింపాదిగా ''నా బిడ్డలిట్ల చీగిటీగల్లో పండుకోనుంటే నాకు అన్నమెట్ల సయిస్తింది పెద్దమ్మా! యెన్నుమింద గువ్వమాదిరి పెరిగిందాన్ని. పెండ్లయి తానే నాకీమాదిరిగా అడువుల్లో తెల్లారతావుండాది. తెల్లారినుంచీ నాకు కండ్లు మూసినా తెరిచినా ఆ పామే కనబడతావుండాది. రెండు బారలుండాది. తలుచుకుంటే నాకు వొళ్ళు మానైపోతావుండాది'' అంది.

''నేను అడువుల్లో పుట్టి పెరిగినోన్నే తిమ్మక్కా!'' రాజయ్య వెంటనే అందుకున్నాడు. ''దాని మాదిరిగా నాకు పాములన్నా అడివి పందులన్నా బయం లేదు. యిప్పటికి నేనెన్ని పాముల్ని చంపినానో నాకే లెక్క తెలవదు. దాన్ని పండుకోమను. యెంతయినా యీ యింటికి వాచ్‌మేను నేను గదా!''

పూరింటి కవతల పొదల్లోంచీ జరజరమని సవ్వడి వచ్చింది. కుక్క పైకిలేచి మొరగసాగింది. రాజయ్య పంచపైకెగ గట్టుకుని బాటరీ చేతబట్టుకుని అటు కేసి నడచాడు.


''ఆ పక్కకు పోవద్దు'' అంది పంచరత్న కీచుబోతున్న గొంతుకతో. రాజయ్య రెండడుగులు ముందుకేయగానే ''పోవద్దన్నేదా నిన్ను? అదెట్లపోతే మనకేల? నువ్వొచ్చి గుట్టుగా కూర్చో'' అని అరిచింది.

రాజయ్య వెనుదిరిగి వస్తూ ''యెంటవ... బ్యాట్రీ లైటు పడతానే వురికింది'' అన్నాడు.

''యెంటవా? దానికే యింత రంపు జెయ్యాల్నా?'' తిమ్మక్క పెదవులు చప్పరించాక పెద్దగా అవులించింది.

యెవరికో చెబుతున్నట్టుగా ''పల్లె కొంపల్లో వుండేటప్పుడు నేను చాకలోళ్ళకు చాకల్ది... యీ టౌను కొచ్చినాంక వాచ్‌మానుకు వాచ్‌మేను..'' అంది పంచరత్న నిష్టూరంగా.

కాస్సేపు నిశ్శబ్దంగా వున్నాక ''అప్పటికి నేను వూరోళ్ళ గుడ్డల్ని వుతికినట్లే దీని గుడ్డలు గూడా వుతకలేదా తిమ్మక్కా? యీ తావులో యీ యింటికి కావిలున్నట్టే దీనికీ బిడ్డలకూ గూడా కావిలుండలేదా చెప్పు! నా అగసాట్లు నేనెవ



రితో చెప్పుకోవాల?'' అన్నాడు.

దూరంగా కడుతున్న యింటి దగ్గర వూరకుక్కొకటి పెద్దగా మొరగసాగింది. గుడిసెముందు పడుకున్న కుక్కపైకిలేచి గొంతు సవరించుకోబోయింది. రాజయ్య ''డూయ్ గొమ్మునుండు'' అని చేయి విసిరాడు. అది మళ్ళీ పాత భంగిమలోనే పడుకొంది.

''అందుకే యీ వాచ్‌మేను పనీ, బేల్‌దారీ కూలీల పనీ వొద్దు. గుట్టుగా వూర్లో కులవృత్తి చేసుకుందామని చిలక్కు చెప్పినట్టు చెప్పినా తిమ్మక్కా! యిన్లేదు'' అన్నాడు రాజయ్య.

యెక్కడినుంచో రైలు కూతొకటి దారి తప్పించుకుని వస్తోంది. మరెక్కడినుంచో గుడ్ల గూబ అరుపు బయాన్ని రేకెత్తిస్తోంది.

''ఆపల్లె కొంపల్లో యెంతగా వొంగొంగి బతికినా గుణం లేదు పెద్దమ్మా! చాకలోళ్ళు చాకలోళ్ళని కడగొట్టోళ్ళుగా చూస్తారుగానీ నలుగురితో సమానంగా యెంచరు. అట్లాంటోళ్ళకు యెందుకు అణకువగా పడుండాల చెప్పు?'' అంది పంచరత్న.

ఆకాశం నుంచీ నక్షత్రమేదో రాలి పడుతున్నట్టుగా కనబడుతోంది. కొండ శిఖరంపైన నామాల్లో వొక గీత వెలగడం మానేసినట్టుంది.

''మా వూరుగాదని దాని వూరికే పోతిమి. అదీ బాగలేదని యీడికొస్తిమి. వైరింగు పనొచ్చునని కరెంటంగిట్లో పనిచేసేనాను. అది లాభంలేదని యీడ మేస్త్రీ దగ్గిర కూలీ కొచ్చినాము. పాత వాచ్‌మేను పారిపోతానే మేస్త్రీ నాకే యీపని పెట్టినాడు. యిక్కడైనా నాకు కూలి కుదిరేది దీనికిష్టంలేదు...'' రాజయ్య గొంతు జీరబోయింది.

హాల్లోపలినుంచీ ఫేనుసవ్వడి అంతకంతకూ పెరుగుతున్నట్టుగా వినపడుతోంది. యింటి చుట్టూ వున్న ముళ్ళచెట్ల పొదల్లోంచీ కీచురాళ్ళు గీపెడుతున్నాయి.

''యీ మాదిరి యిండ్లు గట్టేటావుల్లో సంసారం చేసే దానికయితిందా పెద్దమ్మా! పగుల్లో పనిచెయ్యాల. రేత్రుల్లో యేడతావు దొరికితే అక్కడ పండుకోవాల... యిప్పుడీ యింటికి సొంతగల్లోళ్ళొచ్చి మమ్మల్నీ మాదిరిగా యీదిలోకి తరిమేసినారు. యిప్పుడు నేనూ, నా బిడ్డలు యాడికి పోవల్లా?...'' పంచరత్న గొంతు యేడుపుతో బొంగురుపోయింది.

''వాళ్ళొచ్చింది గృహప్రవేశమైనాంక మూడు నిద్రలు పొయ్యేదానికి... గట్టిగా పనిచేస్తే యింకా నెలదినాల పని మిగిలే వుండాది... యీ మూడు దినాలూ అయిపోయినాక నెలదాంకా వాళ్ళు రారు..'' అన్నాడు రాజయ్య గొంతు తగ్గించి వేడుకుంటున్నట్టుగా.

యింటిగల్లాయిన గురక క్రమంగా పెద్దదై హాలునంతా క్రమ్మేసింది. వరండాలో పడుకున్న తిమ్మక్క మెల్లగా గుర్రు పెట్టసాగింది.

రాజయ్య మోకాళ్ళపైన దాచుకున్న తలపైకెత్తాడు. వరండా మెట్లపక్కన చీకటిలో మురికిగుడ్డల మూటలా ఉంగలు చుట్టుకుని కూర్చున్న భార్యతో యేదో చెప్పటం కోసం పెదవులు విప్పబోయాడు. తరువాత ''ఫ్చ్...ఫ్చ్'' అని పెదవులు చప్పరిస్తూ పిల్లలపైన దుప్పటిని సర్దాడు. వాళ్ళపక్కన అలాగే ముడుచుకుని పడుకున్నాడు.

గుడిసెముందున్న దీపం గూడా నిద్ర ముంచుకొస్తున్నట్టుగా జోగసాగింది. దీపాలు కుట్టిన నల్లటి శాలువా కప్పుకున్న వూరు నిద్రలో మునిగిపోయింది.

***

వులిక్కిపడి కళ్లు తెరిచి ''యెవురాడ? యెవురాడ?'' అని గొణిగాడు రాజయ్య.

వరండాలో పిల్లలు పడుకునే వున్నారు. హాల్లో పల డాలీ నిద్రపోతూనే వుంది. కుర్చీలో కూర్చుని వున్న యింటిగల్లావిడ తిరగకుండా ఆగిపోయున్న ఫానుకేసి బయంగా చూస్తూ ''యిదేం ఫాను? అదెక్కడ తెగి పైన పడుతుందోనని హడలిపోయాను'' అంది.

''సరే, డాలీని లేపు.. యింటికెళ్దాం'' అన్నాడు యింటిగల్లాయిన.

''డాలీ, లే వెళ్దాం'' యింటి గల్లావిడ పాపాయిని బలవంతంగా లేపి కూచోబెట్టింది.

''బంగరట్లా ఫాను... రెండు నెల్లుగా జమ్మని తిరగతా వునింది'' అంది పంచరత్న వుక్రోషంగా.

''అదేం ఫాను? సవుండెక్కువ. వచ్చేగాలి తక్కువ'' అన్నాడు యింటిగల్లాయిన విసుగ్గా.

''అదేమో నాకు తెలవదు. మాఫాను మాకు కావాల్ల... అది లేకపోతే నా బిడ్డలకు నిద్రరాదు'' అంది పంచరత్న కరకుగా.

యింటిగల్లావిడ విస్తుపోయి ''కొంపదీసి దాన్ని రిపేరు చేసిమ్మంటావా యేమిటి?'' అని అడిగింది.

రాజయ్య భార్యకేసి బిత్తరచూపులు చూడసాగాడు.

''సాయింత్రానికి మా ఫాను మాకు రిపేరు చేసియ్యండి.. లేకపోతే నే నొప్పుకోను'' పంచరత్న వెనక్కు తగ్గలేదు.

''రెండు నెలలుగా యీ ఫాను మాకరెంటుతోనే తిరుగుతోంది గదా! ఆ చార్జీ లెవురు గడతారు?'' యింటిగల్లావిడ కోపంతో వురిమిచూసింది.

''కావిలునిందానికి ఫానేసుకున్నాము. దానికేమీ కరెంటు చార్జీ గట్టాల్సినపన్లేదు'' పంచరత్న సమాధానం ప్రశ్నను తరుముకొచ్చింది.

యింటి గల్లాయిన చెప్పులు తొడుక్కుంటూ ''నీ భార్య పొద్దున్నే తగువేసుకోడానికి చూస్తోంది రాజయ్యా! అందరూ ఆమె గురించి చెబుతూంటే యేమో అనుకున్నాను. వాచ్‌మేనుగా వుండే మనిషి వొంటిగావుంటే మంచిది, కుటుంబమంతా వచ్చికూచుంటే మంచిదిగాదు – అని ఆ మేస్త్రీ చెప్పనే చెప్పాడు. అయితే పోతే పోనీలే, బీదవాళ్ళని చూశాన్నేను. యిప్పుడు నీ భార్య మాపైకే పోట్లాటకొస్తోంది'' అన్నాడు కోపంగా.


''అదంతా నాకొద్దు... సాయింత్రానికి నా ఫాను నాకు తిరగాల..'' పంచరత్న తన వాదాన్ని మానలేదు.

''యిలాగైతే లాభంలేదు. చిన్న ఫాను దగ్గరే యింత చిన్న బుద్దయితే యేం బాగలేదు'' అన్నాడు యింటిగల్లాయిన రౌద్రంగా.

''యీ మాదిరి యెదిరించే వాచ్‌మేను మాకొద్దు... ముందు మాయింట్లోనించీ బయటికి వెళ్లండి'' యింటిగల్లావిడ గొంతు చించుకుంది.

''పోకుండా యిక్కడ్నే వుంటామా? మా ఫాను మాకు యిచ్చేయ్యండి. మీరు వుండమంటే గూడా వుండం.'' పంచరత్న గూడా గొంతు పెంచింది.

యింటికి నూరబారల దూరంలో వో పొద వెన



కనుంచీ బయటికొచ్చిన తిమ్మక్క పెద్దగా అరిచింది. అర్థంగాని మాటలు వెలువరిస్తూ రెండు గెంలు గెంతాక ''ప్ప...ప్ప...ప్పాము'' అని అరుచుకుంటూ ముందుకు దూసుకుకొచ్చింది.

కర్రతో బాటూ పరిగెత్తిన రాజయ్య అక్కడే ఆగి, కళ్ళు పెద్దవిగా చేసుకుని చూశాక 'చచ్చి పోయ్యుండాది... యింకా తోక కదలాడతా వుండాది. చంపేసి గెడిసేపుగూడా అయుండదు'' అన్నాడు.

యింటిగల్లాయిన భయపడుతూ తొంగి చూసి ''నాగుపామూ?'' అని అడిగాడు.

''సరిగ్గా తలపైన పడుండాది రాయి.. పడగ కనపడాటంలేదు'' అన్నాడు రాజయ్య తడారిపోతున్న గొంతుతో.

''నాగుపామయితే అట్ల వూరికే పారేయగూడదు. కాల్చేయాల... నాలుగు చింకి కంపలు తెచ్చేసి కాల్చేయి రాజయ్యా!'' అంది తిమ్మక్క.

డాలీ స్కూటరు పైకెక్కగానే ''పోదాం పదండి'' అంది యింటిగల్లావిడ కనురెప్పలు బయంతో టపటపలాడిస్తూ.

స్కూటరు దుమ్మును రేపుతూ పరిగెత్తింది.

చచ్చిన పామును కర్రతో వో పొదలోకి తోసేశాక రాజయ్య హాల్లోకొచ్చి ఫానుకేసి చూశాడు. ఫానుంచీ వచ్చిన రెండు కరెంటు తీగలు యింకా ప్లగ్గులోపలే వున్నాయి. కింద అడుగుపాడవున్న కరెంటు తీగ కనిపించగానే వంగి చేతికెత్తుకున్నాడు. గుడిసెలోంచీ స్క్రూడ్రయివరు తీసుకొచ్చి స్టూలుపైకెక్కి ఫానురెక్కలు విప్పసాగాడు.

తిమ్మక్క బాగా దగ్గరికొచ్చి గొంతు తగ్గించి ''నువ్వే రిపేరుచేసి తెస్తావా రాజయ్యా?'' అని అడిగింది.

విప్పిన ఫాను రెక్కను నేలపైన పెడుతూ రాజయ్య భార్యకోసం చూశాడు. పంచరత్న వాచ్మేను గుడిసెలోంచీ పాతగిన్నెలున్న గోతం తీసుకొచ్చి బయటపడేస్తోంది. నిద్రలేచిన పిల్లలిద్దరూ తల్లి కొంగుపట్టుకుని తిరుగుతున్నారు.

మరో రెక్కను విప్పుతూ ''దానికి పాములంటే చచ్చేంత బయం తిమ్మక్కా! అయితే దానిది బలే గురి... సరైన మొగోడు వొక చేత్తో యెత్తలేనంత పెద్ద బండది. కానీ ఆ వుగ్రంలో దానికి బరువూ గిరువూ తెలిసినట్టులేదు.... అన్నాడు రాజయ్య.

''అంటే... ఆ పామును చంపింది నీ పెండ్లామా? నిజంగా?'' ముసలి తిమ్మక్క నోరు పెద్దగా తెరిచేసింది.

''నేను నిద్రలో వుండానని అదే అంతపనిచేసుండాది. అదే వుగ్రంలోవచ్చి ఫాను ప్లగ్గులో వైరు దోపినట్టుండాది...'' అతను తనతో తాను మాట్లాడుకుంటున్నట్టుగా చెప్పసాగాడు.

''అవునా? నిజింగా?'' తిమ్మక్క నోరు మూతబడలేదు.

''అదా మాదిరి వుగ్రంలో వుండేటప్పుడు నరమానవులేం జెప్పినా యినదు. యిక్కడుండి గిచ్చి జెగడాలు దెచ్చుకునేదానికి నావల్లగాదు...'' మరో రెక్కను విప్పి కింద పెడుతూ రాజయ్య తేల్చిపారేశాడు.

''అయితే యిప్పుటికిప్పుడు యాడికి పోతారు నాయనా?'' ముసలి తిమ్మక్క అంగలార్చింది.

''యేడ తావు దొరికితే ఆడికి... యేడ దానికి కోపందరాదో ఆ తావుకు ... యీడికి రాకముందు యెన్టీఆర్ కాలనీలో బాడిగకున్నాం. ఆ యిల్లు యింకా ఖాళీగా వుందేమో చూడాల...'' అన్నాడు రాజయ్య పెద్దగా నిష్టూరుస్తూ.

గుడిసెలోంచీ మరో గోతం తీసుకొచ్చి బయటపడేశాక గొంతులోని నరాలన్నీ పైకుబుకుతుండగా, శక్తినంతా వుగ్గబట్టుకుని ''నా ఫాను అరువు చేసీకపోతే నేను గొమ్మునుండను'' అని అరిచింది పంచరత్న.

*


మధురాంతకం నరేంద్ర
9866243659



